# ఆదిలాబాద్-మంచిర్యాల



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com



గురువారం 18 ఏప్రిల్ ,2024,పేజీలు 08

◆ నిర్మల్ ◆ కొమురంభీం ఆసిఫాబాద్


## నిషేధిత గంజాయి పట్టుకున్న జైనూర్ పోలీస్

**జైనూర్, ఏప్రిల్ 16, సూర్య మేజర్ న్యూస్**

జైనూర్ మండలంలోని గౌరీ గ్రామపంచాయతీలోని కొలంగూడ కు చెందిన ఆత్రం భీంరావు ఇంటి వద్ద 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని,కేసు నమోదు చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్టు జైనూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అంజయ్య తెలిపినారు.వివరాల్లోకి వెళితే



నమ్మదగిన సమాచారం మేరకు జైనూర్ ఎస్ఐ సందీప్ కుమార్ , సిబ్బంది , డిప్యూటీ తహసీల్దార్ , ఇద్దరు పంచులతో సహా గౌరి గ్రామంలోని కొలంగూడకు వెళ్లి ఆత్రం భీంరావు, 67 సం, అను అతని ఇంటిలో సోదాచేయగా 3 కేజీల ఎండు గంజాయి దొరికినది, దానిని పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకుని, ఆత్రం భీంరావు పై కేసు నమోదు చేయటం జరిగింది. ఇతను తన వ్యవసాయ భూమిలో ప్రత్తి పంటతో సహా గంజాయి మొక్కలను పెంచి తరువాత వాటి ఆకులను ఎండబెట్టి, అలా ఎండబెట్టిన గంజాయిని అమ్ముతున్నాడు. బుధవారం ఆత్రం భీంరావును అరెస్ట్ చేసి జడిష్షియల్ కస్టడికి పంపించటం జరిగింది.ఈ సందర్భంగా జైనూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకులోను కావద్దు అని, తల్లి తండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలి అని, యువత ఇలాంటి వాటికి అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దు అని, మీ దగ్గర గంజాయి సమాచారం ఉంటే పోలీస్ వారికి తెలపాలి అని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం అని, గంజాయి పండించినా , అమ్మిన, రవాణా చేసిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం అని , గంజాయి నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలి అని కోరారు.

## సీతమ్మ మెడలో పుస్తె కట్టిన ఏక పత్నివ్రతుడు రామయ్య

**- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే వివేక్**

**మందమర్రి టౌన్, ఫిబ్రవరి 17, సూర్య మేజర్ న్యూస్.**

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలోని మిథిల ప్రాంగణంలో బుధవారం అభిజిత్ లగ్నంలో సీతారాముల వారి కళ్యాణ మహొూత్సవాన్ని మంత్రోచ్చరణలు, భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక శోభ నడుమ వేద పండితులు శాస్త్రోక్తంగా అత్యంత వైభవోపేతంగా వైకుంఠాన్ని తలపించే విధంగా నిర్వహించారు. లోకాభిరాముడి మహా అద్భుత అపురూప ఘట్టాన్ని వీక్షించేందుకు అశేష భక్త జనం తరలివచ్చి కళ్యాణాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా మందమర్రి



పట్టణంలోని పలు దేవాలయాలలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే వివేక్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దంపతులు స్వామివారి కళ్యాణ తంతులో పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సైతం వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు.మన నిత్యజీవితంలో



రామశబ్దం భాగమైంది. లాల పోసేటప్పుడు శ్రీరామ రక్ష.. జోలపాడేటప్పుడు రామాలాలీ మేఘ శ్యామాలాలీ.. ఓదార్పుగా అయ్యోరామ.. అనకూడని మాటవింటే రామ రామ.. పద్దు పుస్తకాలను ప్రారంభిస్తూ శ్రీరామ.. కూర్చునేటప్పుడు లేచేటప్పుడూ రామా.. ఇలా ఆయన అందరి నాలుకల మీదా నర్తిస్తూనే ఉన్నాడు.. ఉంటాడు.స్వామి వారి కళ్యాణం అనంతరం పంచముఖి ఆలయ ధర్మకర్త కీర్తిశేషులు కల్వకుంట్ల సురేందర్ రావు జ్ఞాపకార్థం వారి సతీమణి, కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాద కైంకర్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్తలు, కమిటీ సభ్యులు, హనుమాన్ మాల ధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



## నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

**- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్ ఏప్రిల్ 17 సూర్య మేజర్ న్యూస్**

లోకసభ ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఈ సందర్భంగా బుదవారం జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం,ఐటిడిఏ పిఓ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సంబంధిత అధికారులు కలసి ఏర్పాట్లను పరిశీలించారు.పలు మార్పులు చేర్పుల కోసం అధికారులకు సూచనలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలనిఅధికారులకు సూచించారు .నిబంధనలు ఉల్లంగించకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంట పలు జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు.



## నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు

**- నేటి నుండి నామినేషన్ల స్వీకరణ- అభ్యర్థులు నిబంధనలను కూలంకషంగా తెలుసుకోవాలి - సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు - అదిలాబాద్ జిల్లా లోక్సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా**



**అదిలాబాద్ ఏప్రిల్ 17 సూర్య మేజర్ న్యూస్:**

లోకసభ ఎన్నికలను పురస్కరించుకొని నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్, అదిలాబాద్ లోకసభ రిటర్నింగ్ అధికారి రాజర్షి షా,పేర్కొన్నారు. తరువాయి..6లో

## టి ఎస్ ఆర్ టి సి గమ్యం ఆప్ గురించి ప్రజలకు అవగాహన

**నిర్మల్ ప్రతినిధి ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ డిపో ఆధ్వర్యములో బుధవారం నర్సాపూర్ ( జి ) బస్టాండ్ లో గ్రామ ప్రజలకు యువకులకు ఆర్టీసీ గమ్యం ఆప్ ఫోన్ లో డౌన్ చేసుకొని వాడాలని వాటి ఉపయోగాలను వివరించారు.మీరు ఎక్కవలసిన బస్సు ఎక్కడి వరకు వచ్చింది,ఎప్పుడు వస్తుంది తెలుసు కోవచ్చుని,రిజర్వేషన్ నంబర్ తో నైనా బస్ నంబర్ తో నైనా లేదా నుండి వరకు అయినా డిస్టిక్ బసులలో ఎంచుకొని సర్చ్ చేయండి అని నిర్మల్ డిపో కంట్రోలర్లు ఎల్ .నర్సయ్య,దండు గంగన్న వివరించారు.అలాగే రోడ్డు భద్రత గురించి అవగాహనా కలిపించారు.ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని కోరారు.కార్యక్రమములో యువకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సూర్య www.suryaa.com



## సద్గురు పులాజి బాబా ధ్యాన మందిర నిర్మాణానికి భూమి పూజ



**అదిలాబాద్ ఎప్రిల్ 17 సూర్య మేజర్ న్యూస్**

పరమహంస సద్గురు పులాజి బాబా ధ్యాన మందిర నిర్మాణానికి ఆదిలాబాద్ పట్టణ పరిసరాల్లో గల మావాల శివారి ప్రాంతంలో గల సర్వే నంబర్ ఒక 181/11 లో ఒక ఎకరం భూమి స్థలంలో శ్రీ సిద్ధ మహా యోగ పీఠం సిద్దేశ్వర సంస్థాన్ పట్నాపూర్ అధ్యక్షులు కేశవ్ దాదా ఇంగ్లే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ... రాజు బాయి గంగన్న పట్టేదారు, జాదవ్ సోనే సింగ్ గారు ధ్యాన మందిర నిర్మాణానికి ఒక ఎకరం భూమి విరాళంగా ఇవ్వడం అభినందనీయమని అన్నారు. అలాగే నూతనంగా ఏర్పడ్డ ధ్యాన మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీష్ గురుసులే, సుకుమార్ పేట్కులే, మిగతా కవిటి సభ్యులంతా కలిసి ధ్యాన మందిర నిర్మాణానికి బాధ్యత చేపట్టడం,బాబా ధ్యాన, జ్ఞాన బోధనలను ప్రపంచానికి తెలియజేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అనారు. మనమంతా కలిసి రాబోయే రోజుల్లో ఇక్కడ భవ్యమైన ధ్యాన మందిరాన్ని నిర్మించుకుందామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్నాపూర్ సంస్థాన్ గౌరవ అధ్యక్షులు వామన్ ఇంగ్లే, జాదవ్ తుకారాం సార్, ధ్యాన మందిర కమిటీ సభ్యులతో పాటు పరిసర ధ్యాన మందిర కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

### ఇచ్చోడలో బస్ స్టాప్ వద్ద

## చలి వేంద్రం ప్రారంభం

**ఇచ్చోడ, ఏప్రిల్ 17 సూర్య మేజర్ న్యూస్,**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల పరిధిలోని దుబార్ పేట్, గ్రామానికి చెందిన ప్రముఖ ఆదివాసి కళాకారుడు కత్లే శ్రీధర్.. అదిలాబాద్ జిల్లాలో తీవ్ర ఎండల ప్రభావం వల్ల ప్రయాణికుల, ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో స్థానిక నిర్మల్ బస్ స్టాప్,ఐబీ వద్ద.. చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసి..బుధవారం ఇచ్చోడ ఎంపీడీవో లక్ష్మణ్ ,చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారుడు కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ. భూమిపై కాలుష్యం వల్ల ఉష్ణోగ్రతల పెరిగి, పర్యావరణంలో మార్పుల వల్ల ఉష్ణోగ్రతల్లో పెను మార్పులు సంభవిస్తున్నాయి అని వాటి ప్రభావం మనుషులపైనే ఉంటుందని.. పెరిగిన ఉష్ణోగ్రతల నుండి ప్రజల్ని కొంత ఉపశమనం వైపు తీసుకువెళ్లే దిశగా మా సకల కళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ చలివేంద్రాన్ని సిరిచెల్మ వైపు వెళ్లే గ్రామస్తులు, నిర్మల్ వైపు వెళ్లే ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ నారాయణ ప్రముఖ కళాకారుడు చాహకటి రవి రేల రేల సింగర్ , ప్రయాణికులు,వివిధ గ్రామాల యువకులు,మహిళలు పాల్గొన్నారు.



## గిరిజన ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్‌తో సమానమైన విద్య అందిస్తాం

### - ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ

**బోథ్ ,ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్**

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ బుధవారం అజ్జర్, వజ్జర్ ప్రాంతం,లో లేండిగూడ, మహాదుగూడ, కేశవ్ గూడా జైతు గూడలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ ఆదివాసీ ఆడబిడ్డ ను ఆశీర్వధించాలని ప్రతి గిరిజన పల్లెలో ప్రతి సంవత్సరం 50 శాతం ఇండ్లు నిర్మిస్తామని, పోడు పట్టాలు అందరికి అందిస్తామని, గిరిజన ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ తో సమానమైన విద్య అందిస్తామని, అదేవిధంగా, ఇ వజ్జర్ ప్రాంతంలో తాగు నీటి సాగు నీటి సౌకర్యం చెక్ డ్యామ్ లు కట్టి



అందిస్తామని,గతంలో మంత్రిగా,ఎమ్మెల్యేగా,ఎంపీగా గోడం నగేష్ విఫలం అయ్యారని ఆదివాసీ గూడెలను మరిచారాని విమర్శించారు.ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీ దే అని కాంగ్రెస్ కేంద్రం లో అధికారం లోకి రాగానే ఉపాధి హామీ కూలీలకు రోజు 400 రూపాయల చొప్పున కూలి అందిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆడే గజేందర్ , ఎ.ఎం.సీ చేర్మెన్ బొడ్డు గంగారెడ్డి,అధికార ప్రతినిది చంటి,వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ షేక్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ పోతారెడ్డి,సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల సీనియర్ నాయకులు ఎ.ఎం.సీ డైరెక్టర్ ఇషరు పటేల్ గాజుల పోతన్న, విజయ్ భాస్కర్, అనిల్, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పళ్ళు పంపిణీ చేసిన ఓబిసి మోర్చా అధ్యక్షులు



**తలమడుగు,ఏప్రిల్ 17 సూర్య మేజర్ న్యూస్,**

అదిలాబాద్ రూరల్ మండలానికి చెందిన తంతోలి గ్రామవాసి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు మద్దికుంట్ల వెంకన్న యాదవ్ తన కూతురు పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా ప్రతి సంవత్సరం ఏదో ఒక సేవా కార్యక్రమం చేస్తారు అందులో భాగంగానే ఈ ఏడాది తన కూతురు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని తలమడుగు మండలంలోని సాయిలింగి గ్రామంలో గల వృద్ధాశ్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి ముందుగా కేక్ కట్ చేసి అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు.

## హస్తం పార్టీలో చేరిన పల్లి బి మాజీ సర్పంచ్

**తలమడుగు,ఏప్రిల్ 17 సూర్య మేజర్ న్యూస్,**

రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు.తలమడుగు మండలంలోని పల్లి-బి గ్రామ మాజీ సర్పంచ్ కుమ్రా మల్లు పటేల్, సొసైటీ డైరెక్టర్ లోక లింగ రెడ్డి లు కాంగ్రెస్ పార్టీకి లో బుధవారం రోజు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ అడ్డి భోజ రెడ్డి, జడ్పిటిసి గోక గణేష్ రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీలు బాబన్నా, కొండ గంగాధర్, ఎంపీటీసీలు వెంకన్న, సోమన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మాజీ సర్పంచ్లు నర్సింహులు, విఠల్, సంజీవ్, గంగన్న, నగేష్, గిమ్మ సంతు తదితరులున్నారు.



## రమణీయం కమనీయం సీతారాముల కళ్యాణం




**లక్ష్మణ చాంద,ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్**

మండల కేంద్రంలోని చామన పెల్లి, వద్యాల్, పీచర గ్రామాలలో బుధవారం రోజున శ్రీరామనవమి వేడుకలను సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరుపు కున్నారు. కళ్యాణ మూర్తులకు అలంకరణ చేసి ఊరేగింపుగా మండపాలకు తీసుకువచ్చారు. మంగళ హారతులతో భాజా భజంత్రీలతో గ్రామ వీధులలో ఊరేగింపుగా శ్రీరాముని విగ్రహ శోభాయాత్రను నిర్వహించారు. భక్తులకు సీతారాముల గుణ శీలతను వివరించారు. వైదిక పెద్దలు చేసిన సంవాదం భక్తులను మంత్రముగ్ధుల్ని చేసింది. వేద మంత్రోచ్చారణాల మధ్య సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి కళ్యాణానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయంత్రం వేళలో స్వామివారి గరుడ సేవ, రథోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం కోసం అన్నదాన కార్యక్రమం, నీటి వసతులను గ్రామ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

### ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

**గుడిహత్నూర్,ఏప్రిల్ 17 మేజర్ సూర్య న్యూస్**







శ్రీ రామ నవమి వేడుకలు బుధవారం మండలంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు మండలంలోని ఉమ్రి పంచాయతీ లో ఉన్న రామ మందిరం మన్నూర్, మలో ని రామ ఆలయం తోషం హనుమాన్ ఆలయంలో మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో వేడుకలు నిర్వహించారు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు పూజలు చేశారు అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

# సీఎం రేవంత్‌రెడ్డిపై నోరుపారేసుకుంటే ఖబడ్దార్

**- కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఫైర్ - మాజీమంత్రికి అధికారం కోల్పోయి మతిభ్రమించిందని చీవాట్లు - బీఆర్ఎస్, బీజేపీ వైఖరిని ఎండగట్టిన ఖానాపూర్ ఎమ్మెల్యే.**



**ఆదిలాబాద్ ఏప్రిల్ 17 సూర్య మేజర్ న్యూస్**

మాజీ మంత్రి కేటీఆర్ ఆదిలాబాద్ వేదికగా మాట్లాడిన మాటలను, సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. జిల్లాకేంద్రంలోని కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ తీరుపై ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల తర్వాత పదే పదే బీజేపీలో చేరుతారని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలంటూ హితవు పలికారు. అధికారం కోల్పోయాక జీర్ణించుకోలేకనే అసహనంతో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆరోపించారు. బీఆర్ ఎస్, బీజేపీల వైఖరిని తప్పుబడుతూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టారు. వెనుకబాటుకు గురైన ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై అనవసరంగా లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీని పనిగట్టుకుని బాద్‌నాం చేయాలని చూస్తే ఊరుకోబోమని, తమ తడాఖా చూపిస్తామని అన్నారు. తెలంగాణ ద్రోహులను పార్టీలో చేర్చుకుని మంత్రి పదవులు కట్టబెట్టి నిజమైన తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందని బీఆర్ఎస్ కాదా అంటూ నిలదీశారు. వాస్తవంగా బీజేపీతో దోస్తానా చేసింది బీఆర్ఎస్ అంటూ ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రంలో బీజేపీ నల్లచట్టాలు తీసుకొచ్చినప్పుడు మద్దతు తెలిపి మౌనం వహించింది మీరు కాదా అంటూ ఆగ్రహించారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటే మౌనం వహించారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత భరించలేకనే రైతులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రెండు లక్షల రుణమాఫీ ఏమైందంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీలకు తాము కట్టుబడి ఉన్నామని, ఒక్కొక్కటిగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఖజానా మొత్తం ఖాళీ చేసి ఇప్పుడు హామీలను నెరవేర్చడంలేదని ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాటే అన్న చందంగా బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌పై అబండాలు మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అసలు ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేసిందంటూ ప్రశ్నించారు. ఇప్పటికీ అనేక ఆదివాసీ గిరిజన గ్రామాలు, మారుమూల పల్లెల్లో తాగునీటికి కష్టాలు తప్పడంలేదన్నారు. మిషన్ భగీరథ పేరు మీద కోట్ల రూపాయలు కమీషన్లు తీసుకుని ఇంటింటికీ నల్లా నీటిని అందించామని గొప్పలు చెప్పుకోవడం బీఆర్ఎస్‌కే చెల్లిందని ,ఘాటుగా విమర్శించారు. నిజంగా నీటి సమస్యకు పరిష్కారం చూపి ఉంటే పల్లెల్లో తిరుగుదామని, అదే నిజమైతే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్‌పై లేనిపోని ఆరోపణలు చేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ లబ్ధిపొందడానికి యత్నిస్తున్నారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఈ ప్రాంతానికి చేసిందేమీలేదని, వారికి ఓట్లు వేసి మళ్లీ మళ్లీ మోసపోవద్దని తెలిపారు. పేద బిడ్డలను చట్టసభలకు పంపిస్తే ప్రజల గొంతుకగా తమ వాణి వినిపిస్తామని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, మాజీ జడ్పీటీసీ కొండ గంగాధర్, బొల్లారం బాబన్న, మాజీ మున్సిపల్ చైర్మెన్ దిగంబర్ రావు పటేల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్ వాంఖడే, ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ షెడ్మకి ఆనంద్ రావు, కౌన్సిలర్ జాఫర్ అహ్మద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, భరత్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో ఘనంగా
# సీతారాముల కల్యాణం

**- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులు**



**బెల్లంపల్లి, ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరామనవమి సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో సీతారాముల కళ్యాణ వేడుకలు కన్నుల పండువగా ఘనంగా జరిగాయి. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యం లో జరిగిన వేడుకలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ – రమ దంపతులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా రాములవారికి ఎమ్మెల్యే వినోద్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం పలికారు. రాములవారి కళ్యాణానికి రాష్ట్ర మాజీ మంత్రి బీ ఆర్ ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య లు తలంబ్రాలు తెచ్చారు. ఆ తర్వాత జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు, మున్సిపల్ ఛైర్పర్సన్ జక్కుల శ్వేత,మాజీ మున్సిపల్ చైర్మన్ మునిమంద రమేష్ – స్వరూప దంపతులు రాములోరి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కోటి తలంబ్రాలు మహిళలు సీతారాములకు సమర్పించారు. కళ్యాణ మహోత్సవంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ పార్లమెంట్ ఇన్చార్జి బండి ప్రభాకర్ యాదవ్, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ముచ్చర్ల మల్లయ్య,టీ పీ సీ సీ ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ నాతరి స్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రామ్ చందర్, మున్సిపల్ కౌన్సిలర్లు సూరం సంగీత, కమిశెట్టి సరిత,నీలి కృష్ణ,సురేష్, దామెర శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మత్తమారి సత్తిబాబు,మాజీ కౌన్సిలర్లు తాండ్ర స్రవంతి, ఎలిగేటి శ్రీనివాస్, ఆలయ కమిటీ ప్రతినిధులు రేణికుంట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొనగా జనహిత సేవా సమితి , మార్వాడి యువమంచ్,ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం, ప్రసాదం పులిహోర, రస్నా, మజ్జిగ అంబలి పంపిణీ చేశారు. అంతేకాకుండా సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బెల్లంపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ అఫ్జలొద్దీన్ ఆధ్వర్యంలో తాళ్ళ గురిజాల, నెన్నెల, బెల్లంపల్లి టూ టౌన్ పోలీసులు వారు వారు బందోబస్తు నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలోని టేకుల బస్తి రామాలయం, రైల్వే స్టేషన్ లోని కోదండ రామాలయం, బెల్లంపల్లి బస్తి లోని రామాలయం, కాశిరెడ్డిపల్లి రామాలయం, నెంబర్ టు ఇంక్లైన్ బస్తి, రామాలయం షిరిడి సాయిబాబా దేవాలయంలో, మండలంలోని చంద్రవెల్లి, చాకెపల్లి రామాలయాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి.



## మంచిర్యాల జిల్లా ముందస్తు అడ్మిషన్‌లు
# చేపడుతున్న జూనియర్ కళాశాలల పై చర్యలేవి

**మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫలితాలు రావడానికి ముందే మా కళాశాలలో అడ్మిషన్ తీసుకుంటే డిస్కౌంట్ ఇస్తామని పిఆర్ఓల ద్వారా విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతూ అడ్మిషన్ లు చేస్తున్న ప్రముఖ కళాశాలల పై మంచిర్యాల జిల్లా ఇంటర్మీడియట్ అధికారుల దృష్టికి వెళ్లిన ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు తెలపాలని అన్నారు. ముందస్తు అడ్మిషన్లు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని తెలంగాణ ఇంటర్ బోర్డు సెక్రటరీ గారు ప్రకటన చేసిన అవేవి పట్టించుకోకుండా అడ్మిషన్ లు చేపడుతున్న కళాశాలల పై జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు వేసవి తరగతులు నిర్వహించరాదని ఇంటర్ బోర్డు ప్రకటన జారీ చేసిన అవేవీ పట్టించుకోకుండా సమ్మర్ క్లాస్ ల పేరుతో విద్యార్థులను కళాశాలకు రప్పించి రెండవ సంవత్సరానికి సంబంధించిన 50% ఫీజు కడితేనే క్లాస్ ల కు పర్మిషన్స్ ఇస్తామని విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మానసికంగా ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్న కళాశాలల పై చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం మారిన విద్యాశాఖ అధికారుల తీరు మారకపోవడం ప్రైవేట్ కళాశాలలతో లోపాయకార ఒప్పందమా లేక రాజకీయ ఒత్తిళ్ల అని మండిపడ్డారు అనుమతి లేని కళాశాలలో పేరుతో భారీగా ప్రచారాలు నిర్వహిస్తూ ఐఐటి, నిట్ కోచింగ్ ల పేరుతో లక్షలాది రూపాయలు దండుకుంటున్న బోగస కళాశాలల పై మంచిర్యాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఎందుకు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవట్లేదని మండిపడ్డారు ఇంటర్మీడియట్ బోర్డ్ అనుమతి లేకుండా ఎలాంటి ప్రచారాలు నిర్వహించరాదని గత సంవత్సరం ఇంటర్ బోర్డు స్పష్టమైన ప్రకటన చేసిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులకు ఇది కనిపించడం లేదని ప్రశ్నించారు ఇప్పటికైనా ఇట్టి కళాశాలల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



## రామ నామంతో పులకరించిన మంచిర్యాల



**మంచిర్యాల టౌన్,ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్:**

హిందువుల ఆరాధ్య దైవమైన రాముని జన్మదినం పర్వదినం సందర్భంగా మంచిర్యాల పట్టణం రామ నామ జపంతో హోరెత్తింది.ఒకే మాట,ఒకే బాణం,అనే సిదాంతంతో హిందువులకు ఆదర్శంగా నిలిచినా సీతారాములా కళ్యాణం పట్టణ



లోని గుళ్ళలో ఘనంగా నిర్వహించడం జరిగింది. స్థానిక గర్మిల హనుమాన్ దేవాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారామ కళ్యాణం వేడుక కనులవిందుగా జరిగింది.భక్తులు అధిక సంఖ్య లో పాలుగొని శ్రీరామని చల్లని దీవెనలు కోసం ప్రార్థనలు చేసారు. పాత మంచిర్యాల హనుమాన్ దేవాలయంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గం ప్రజలకు సుఖ సంతోషాలు ఇవ్వాలని రాముని ప్రార్థన చేసారు.పట్టణంలోని ఏసిసి.లోని దేవాలయంలో స్థానిక అడ్వకేట్‌లు కళ్యాణంలో హాజరై భక్తి శ్రద్దలతో పూజలు చేశారు.

## సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ,ఎంపీ అభ్యర్థి నగేష్



**సారంగాపూర్ ఏప్రిల్ 17 సూర్య మేజర్ న్యూస్**

సారంగాపూర్:మండలంలోని జామ్ పట్టాభి సీత రామస్వామి,స్వర్ణ లోని కోదండ సీతారామాలయంలో బుధవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి,ఎంపీ అభ్యర్థి నగేష్ లు పాల్గొని కోలాటం ఆడారు. శ్రీ రామ నవమి సందర్భంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖశాంతులతో జీవించేలా ఆశీర్వదించాలని తాను సీతారాములను కోరుకున్నానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విలాస్, వడ్డే రాజేందర్, రాజేశ్వర్, కొరిపెల్లి రాజు,గంగారెడ్డి,సాయాబ్ రావు, తిరుమల చారి, రవి, పలువురు పాల్గొన్నారు.



## శ్రీరామనవమి సందర్భంగా బీసీ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**ఆసిఫాబాద్ ప్రతినిధి 17 ఏప్రిల్ సూర్య మేజర్ న్యూస్**

జిల్లా కేంద్రంలోని జనకాపూర్ నందు గల రామాలయ పరిసర ఆవరణంలో శ్రీరామనవమి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూప్నర్ రమేష్ గ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరాముల వారి ఆశీర్వాదంతో భక్తులకు ప్రతి సంవత్సరం 500 లీటర్ల మజ్జిగ పంపిణీ నిర్వహిస్తున్నామని అన్నారు ఆ సీతారామ చంద్రుల



ఆశీర్వాదంతో జిల్లా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు అనంతరం భక్తులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం బాలేష్ బిబీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్,బి బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైరాగడే మారుతి పటేల్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సిరికొండ సాయి కృష్ణ,బీసీ యువజన సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు వైరాగడే రమేష్ మరియు బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎంపీ అభ్యర్థికి ఓటు వేయండి




**గుడిహత్నూర్,ఏప్రిల్ 17 మేజర్ సూర్య న్యూస్,**

మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌కు ఓటు వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు.బుధవారం మండలంలోని కమలపూర్‌లో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌కు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి గ్రామాల రూపురేఖలు మార్చిందన్నారు.రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మూడోసారి మోదీని ప్రధాన మంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు గణేష్ పాటిల్ , బిజెపి మండల అధ్యక్షుడు కేంద్రే శివాజీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బూర్గుడ లోగాలి బీభత్సం

**ఆసిఫాబాద్ ప్రతినిధి 17 ఏప్రిల్ సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని బూరుగూడా గ్రామంలో బుధవారం సాయంత్రం ఒకేసారి ఈదురు గాలులు వీచడంతో ఇంటి పైకప్పులు,విద్యుత్ స్తంభాలు,చెట్లు విరగడంతో ప్రజలు.చాలా.ఇబ్బందులు ఎదుర్కొన్నారు,గ్రామంలోని గాజుల పెంటయ్య,చిగురు గోపాల్,పుధరి పెంటక్క,బుజాడి బొడ్డు,దర్ని రమేష్,ఎరువోతు వినోద్,పులగం శంకర్,దాడి రగులయ్య,ల ఇంటి పైకప్పులు.గాలికి లేచిపోవడంతో ఇంట్లోని నిత్యావసర వస్తువులు తడిసిపోయాయి. అలాగే పుధరి చెంద్రయ్య అనే రైతు ఎద్దు కి గాలికి లేచిపోయి న రేకులు తగలడంతో ఎద్దు కాలు విరిగింది,అలాగే పూధరి పెంటక్క అనే వృద్ధురాలికి ఇంటి పైన వున్న రాయి పడి గాయాలు.కాగా లోకొండే చిన్నక్క పై చెట్టు పడటంతో తీవ్ర గాయాలు అయాయ్యి,రహదారి ప్రక్కనే నిలిపిన లారీ ఒకేసారి గాలి రావడంతో క్రిందపడిపోయింది,రహదారి ప్రక్కన ఉన్న దాబా హొటల్ రేకులు లేచిపోయి పొలాల్లో పడ్డాయి,దీంతో గ్రామ ప్రజలు ఒకేసారి భయాందోళనకు గురయ్యారు.

## వేసవి పూర్తయ్యే వరకు నిరంతర త్రాగునీటి సరఫరాకు చర్యలు

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

**ఆసిఫాబాద్ ప్రతినిధి 17 ఏప్రిల్ సూర్య మేజర్ న్యూస్**

వేసవికాలం పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు సైతం నిరంతర త్రాగునీటి సరఫరాకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో దినపత్రికలలో వచ్చిన వార్త కథనాలపై తక్షణమే స్పందిస్తూ పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని జైనూర్ మండలం దబోలి గ్రామపంచాయతీలో 399 ఆవాసాలు, 1 వేయి 695 మంది జనాభా ఉండగా, గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డెరగూడ గ్రామంలో 35 ఆవాసాలు, 140 మంది జనాభా ఉన్నారని తెలిపారు. దబోలి గ్రామపంచాయతీలో ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు 10 చేతిపంపులు, 2 మోటార్ తో కూడిన బహిరంగ బావులు, 2 మోటారు లేని బహిరంగ బావులు, మిషన్ భగీరథ పథకంలో 40 కె. ఎల్. ఓ. హెచ్. ఎస్. ఆర్. 1, 20 కె. ఎల్. 3, 10 కె. ఎల్. 1, 5 కె.ఎల్. జి. ఎల్. ఆర్. 2 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వడ్డెరగూడతో పాటు షేకుగూడ, జాదుగూడ గ్రామాలలో గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఈ. ఈ., డి.ఈ.ఈ., ఏ.ఈ.ఈ.లు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరుగుతూ త్రాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. త్రాగునీటి సమస్యల పరిష్కారం దిశగా అధికారుల సమన్వయంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

## బిజెపి కార్యాలయం ప్రారంభించిన జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం

**నేరడిగొండ ,ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్**

మండల కేంద్రంలో నూతన బిజెపి కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం ప్రారంభించారు మండల బిజెపి నాయకులకు పార్టీ గెలుపు కొరకు శ్వాసక్తుల కృషి చేయాలని కార్యకర్తలకు నాయకులకు అన్నారు అనంతరం మండలంలోని



శబరిమత ఆశ్రయంలో శ్రీరామనవమి వేడుకలలో పాల్గొన్నారు మండల అధ్యక్షులు సాబ్లే సంతోష్‌సింగ్ బిజెపి నాయకులను ఎన్నుకున్నారు మండల ప్రధాన కార్య దర్శులుగా బంటు ప్రవీణ్ ఆకుల రాజశేఖర్ ధర్మపురి రాఘవులు కార్యదర్శిగా బొంతకుల శ్రీను దళిత మోర్చా అధ్యక్షునిగా లింగంపల్లి సురేష్ ఓబీసీ మోర్చా రాంగుండ్ల సురేష్ లను ఎన్నుకున్నారు.

## శబరిమాత ఆశ్రమంలో పూజలు చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్.

**నేరడిగొండ ,ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని శబరిమాత ఆశ్రమంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కళ్యాణము రంగ రంగ వైభవంగా భక్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో జరిపించారు ఎంపీపీ రాథోడ్ సజన్ . నానక్ సింగ్ రవీందర్ రెడ్డి మండల నాయకులు భక్తులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన శ్రీ రాముని శోభాయాత్ర



**సారంగాపూర్ ఏప్రిల్ 17 సూర్య మెజార్ న్యూస్**

జామ్‌లో రామ నవమి సందర్భంగా బుధవారం శ్రీరాముని శోభాయాత్ర వైభవంగా ప్రారంభిచారు. రాముకి విగ్రహానికి బిజెపి నాయకులు స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్రను ప్రారంభించారు. కాషాయ జెండాలతో రామనామ స్మరణ చేస్తూ భక్తుల జామ్ లోని ప్రధాన వీధుల గుండా, బస్టాండ్ రాముల వారి గుడి వరకు శోభాయాత్ర వెళ్తుంది.

## అడెల్లి ఆలయ తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ ఈవో రంగు రవి కిషన్ గౌడ్

**సారంగాపూర్ ఏప్రిల్ 17 సూర్య మేజర్ న్యూస్**

సారంగాపూర్: మండలంలోని జమ్ పట్టాభి సీతారామస్వామి, స్వర్ణ లోని కోదండ శ్రీ సీత రామ స్వామి ఆలయంలో సీతారాముని



కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయ తరుపున ఆలయ ఇంచార్జీ ఈఓ రంగు రవి కిషన్ గౌడ్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మండల ప్రజా ప్రతినిధులు హాజరైయ్యారు. అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం కన్నుల పండుగ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ పలు గ్రామాలలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న భూక్యా జాన్సన్ నాయక్



**ఖానాపూర్ రూరల్ ,ఏప్రిల్ 17 ,సూర్య మేజర్ న్యూస్**

ఖానాపూర్ మండల్‌లోని శ్రీరాంనగర్,ఎల్లాపూర్ గోసంపల్లె,గోడలపంపు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకల్లో బి ఆర్ ఎస్ ఖానాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ పాల్గొని,స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు .వారు వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణం కమనీయం.. ఈ జగమంతా రామమయం

### - అత్యంత వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్.**

రామకృష్ణపూర్ పట్టణంలో వేంచేసి ఉన్న హరిహర క్షేత్రమైన శ్రీ శ్రీ శ్రీ కోదండ రామాలయంలో ఈరోజు శ్రీరామనవమిలి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ సంబరాలు అంబరాన్ని మిన్నంటుకున్నాయి.సీతా సమేత శ్రీరామ చంద్రమూర్తి కళ్యాణ మహోత్సవానికి ప్రత్యేకంగా అయోధ్య నుండి తలంబ్రాలు,భద్రాచలం నుండి ముత్యాల తలంబ్రాలు,అలాగే మహిళల చేత వడ్లను గోటితో వలిచి తయారు చేసిన తలంబ్రాల తో ప్రత్యేక పూజరులైన గౌరవనీయులు గట్టు నరహరి శర్మ ,



ఆలయ ప్రధాన అర్చకులు ఫనిభట్ల అంబా ప్రసాద్, చక్రవర్తి,ప్రభాకర్ శర్మ,శరత్ శర్మ చే అత్యంత వైభవంగా అశేష భక్త జన సాంద్రత మధ్య నిర్వహించడం జరిగింది. ఈయొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పూజలో పాల్గొన్న మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఆలయ గౌరవ అధ్యక్షులు మనోహర్ కుటుంబ సమేతంగా శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం పెద్ద ఎత్తున మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా జరుపబడింది. అనంతరం శ్రీవిద్య కూచిపూడి నాట్యాలయం రామకృష్ణాపూర్ వారి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన లు ప్రదర్శించబడినవి ఇట్టి ప్రదర్శనను చెన్నూర్ ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి దంపతులు వీక్షించి పిల్లల్ని ఆశీర్వదించారు, పెద్దపల్లి పార్లమెంట్



టిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆ ఆ కళ్యాణ రాముడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు, ఈ మహోత్సవానికి విచ్చేసిన అశేష జనవాహినికి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కన్నుల పండుగ సీతారాముల కళ్యాణం

**వేమనపల్లి ,సూర్య మేజర్ న్యూస్**

ఆంజనేయ స్వామి ఆలయంలో కన్నుల పండుగగా సాగిన శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా జరిగిన జగదాభిరాముడి కళ్యాణ మహోత్సవంలో పుణ్య దంపతులు టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొలివేణి మాధవ్ దంపతులు సీతారాముని కళ్యాణానికి పట్టు వస్త్రాలు బుధవారం సమర్పించారు కొత్తపల్లి నీల్వాయి మంగళపల్లి గ్రామాలలో సీతారామ కళ్యాణోత్సవం లకు భజంత్రీలు వేద పండితుల మంత్రోచ్ఛ రణల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని తిలకించడానికి మండల నలుమూలల నుండి భక్తులు తరలివచ్చారు ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి భక్తులు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల నూతన ఆలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దంపతులు

**ఖానాపూర్ రూరల్,ఏప్రిల్ 17. సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణం శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో నూతన ఆలయ నిర్మాణా భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ దంపతులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా ఈ రోజు నూతన ఆలయ



నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించామని అన్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాయకులు జన్నారపు విజయలక్ష్మి శంకర్ , నాయిని సంతోష్ , ఆలయ కమిటీ అధ్యక్షులు అల్లాడి వెంకటేశ్వర్లు , సతీష్ రావు దేష్ పాండే , మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ , ఎస్సై లింబాద్రి , లందేరి కిషన్ , అయిందల జనార్ధన్, కాలనీవాసులు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో నేడు వైద్య పరీక్షలు

**శ్రీరాంపూర్, ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్:**

డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో నేడు గురువారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయి నందు ఆయుర్వేద వైద్య పరీక్షలు చేయడం జరుగుతుంది. బిపి షుగర్ వంటి వ్యాధులు కీళ్ల నొప్పులు నడుము నొప్పులు వంటి వాటికి పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుంది అని సింగరేణి యజమాన్యం ఒక ప్రకటనలో తెలిపినారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్విని సద్వినియోగం చేసుకోగలరు.

## ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

**పెంచికల్పేట్ ,ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్**

పెంచికల్పేట్ మండలంలోని ఊరు ఊర శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.చెడ్వాయి గ్రాములోని చీకటయ్య హనుమాన్ ఆలయం వద్ద చౌదరి బండు -స్వప్న జంట పట్టు వస్త్రాలు అంధించి సీత రాముల వారి విగ్రహాలతో ఊరేగింపు చేసి ,ఆలయం వద్దకు చేరుకొని కళ్యాణంలో పాల్గొన్నారు. తుమ్మిడే వెంకటేష్- పొతేపల్లి వారి ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.అలాగే పెంచికల్పేట్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాములా వారి కల్యాణ వేసుకను ఘనంగా నిర్వహించారు.



## సీతారామ కళ్యాణం లో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి గోడం నాగేష్

**నేరడిగొండ ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని శబరిమాత ఆశ్రమంలో శ్రీరామ కళ్యాణమును బిజెపి ఎంపీ అభ్యర్థి గోడం నాగేష్ సీతారామ కళ్యాణం భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సాబ్లే సంతోష్ సింగ్ జాదవ్ పరుశురాం గట్టు నారాయణ రమేష్ మహేందర్ రెడ్డి రాఘువులు బిజెపి కార్యకర్తలు నాయకులు ఉన్నారు.



సూర్య www.suryaa.com

గురువారం 18 ఏప్రిల్ 2024

## శ్రీ సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవ, శ్రీరామనవమి వేడుకలు

**భైంసా,ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్**

భైంసా పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పులే నగర్ పాఠశాలలో సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త హిందీ పండిత్ రామానంద్ తివారి సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావం గురించి వివరిస్తూ దేశంలో మొట్టమొదటిసారి 1952లో గోరఖ్ పూర్ లో సరస్వతీ శిశు మందిర్ స్థాపించబడిందని,ఆ తర్వాత 1967లో రథాలగుడి నిర్మల్‌లోసరస్వతి శిశుమందిరం ప్రారంభించబడిందని, అనంతరం 1968 సంవత్సరంలో ఆదిలాబాదులో,1969 బైంసాలో సరస్వతి శిశు మందిర్ పాఠశాలలు ప్రారంభించ బడినవి అని తెలియజేశారు.ఆ తర్వాత వీటన్నిటినీ అనుసంధానం చేయడానికి 1973లో శ్రీ సరస్వతి విద్యాపీఠం శ్రీరామనవమి నాడు ఆవిర్భవించింది, అందువలన ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు.అలాగే పిల్లలకు రాముని గుణగణాలు రావాలని మరియు లవకుశ ధ్రువ ప్రహ్లాద లాగా ధైర్యంగా ఉండాలని,బాలికలు సీత, సావిత్రి,దుర్గ లాగ తయారు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రబంధ కారిణి సభ్యులు జీలకరి రాజేశ్వర్, ప్రధాన ఆచార్యులు బి.దేవేందర్,ఇంగ్లీష్ మీడియం అకాడమీ ఇన్చార్జ్ ఎస్.పోతన్న,సీనియర్ ఆచార్యులు శిరమణిపాండే,కల్పన,సుజాత,అనిత,లావణ్య,కీర్తి,నవనీత,తిరుపతి, సుధాకర్,అవధూత్,ప్రకాష్,దత్తాత్రి,తివారీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు

**- నేటి నుండి నామినేషన్ల స్వీకరణ - అభ్యర్థులు నిబంధనలను కూలంకషంగా తెలుసుకోవాలి - సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు- అదిలాబాద్ జిల్లా లోకసభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా**

మొదటి పేజీ తరువాయి...

కలెక్టరేట్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ గౌస్ ఆలం తోకలిసి ఆయన వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందని, అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ వివరించారు.ఈనెల 18నుంచి 25వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన జరుగుతుందని అన్నారు. మే 13న ఎన్నికల నిర్వాహణ ఉంటుందని సూచించారు.జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగుతుందని కలెక్టర్ వివరించారు. కలెక్టరే ట్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని రిటర్నింగ్ అధికారి చాంబర్లోనే నామినేషన్లు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నామినేషన్ పత్రాలలో పొరపాట్లు జరగకుండా సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశా మని తెలిపారు.జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన వారు ఎన్నికల్లో పోటీచేస్తే ఒకరు మాత్రమే ప్రతిపాదించాల్సి ఉంటుందని, స్వతంత్రులుగా పోటీచేస్తే పదిమంది ప్రతిపాదించాలని వీరంతా అదిలాబాద్ జిల్లా లోక్సభ నియోజకవర్గ ఓటర్లుగా ఉండాలని తెలిపారు. రాజకీయ పార్టీ తరపున నామినేషన్ వేసి ఆ పార్టీ తరపున బి-పారం రాని పక్షంలో పది మంది నామినేషన్ పై బలపరిస్తే అతను స్వతంత్ర అభ్యర్థిగా రంగంలో దిగే అవకాశం ఉంటుందని సూచించారు.85 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యంగ ఓటర్లు ఇంటి నుండి ఓటు వేసే వెసులుబాటు ఉందని, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజుల లోపు, అంటే ఏప్రిల్ 22వ తేదీ లోపు 12-డి ఫారం భర్తీ చేసి బీ.ఎల్.ఒలకు ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు ముందస్తుగానే వారికి బీఎల్ఓ ల ద్వారా 12 - డీ ఫారంలు అందజేయబడతాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని వర్గాల వారు సహకారం అందించాలని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో అదనపు పోలీసు బలగాలతో పాటు, ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. పరిస్థితులను బట్టి పోలింగ్ నాటికి వీటి సంఖ్య మారే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రజలు తగిన ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదుతో ప్రయాణించ వద్దని, తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆ కమిటీకి తగిన ఆధారాలు సమర్పించినట్లయితే గ్రీవెన్స్ కమిటీ వాటిని పరిశీలించి నగదు విడుదల చేస్తుందని తెలిపారు. తనిఖీ బృందాలకు ప్రజలు



సహకరించాలని సూచించారు. గత శాసన సభ ఎన్నికలలో తమ సహకారం అందించిన విధంగానే ఈ పార్లమెంటు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించాలని పాత్రికేయులను కోరారు.

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓటర్ల సంఖ్య.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో మహిళా ,పురుష,ఇతరులతో కలపి మొత్తం ఓటర్లు 1644715 ఉన్నారన్నారు. అదేవిధంగా,ఉద్యోగ ఓటర్లు మహిళా, పురుషులు,కలపి 2115 మంది ఓటర్లు ఉన్నారన్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో 2199 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని సూచించారు.

### నామినేషన్ల ప్రక్రియకు పోలీసు బందోబస్తు

ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో నగదు 32,480,068,లిక్కర్ 2308.4 లీటర్లు,రూ.7,94,770, గాంజా 7,57,450 సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎం.సీ.సీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్స్ బృందాలను, ఎం.సీ.ఎం.సీ కమిటీ, ఇతర కమిటీలు పనిచేస్తున్నాయని, పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణలో పోలింగ్ నిబంధనలు, మాక్ పోల్ నిర్వహించే విధానం, పోలింగ్ రోజు నిర్వర్తించవలసిన విధులపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పిఓలు, ఎపిఓలు, ఓపిఓలు, పోలీస్ సిబ్బంది అందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే వారిపై సంబంధిత చట్టాలను అనుసరిస్తూ కేసులు నమోదు చేయడం జరుగుతుందని కోడ్ ఉల్లంఘన గురించి ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయవచ్చని, అలాగే సీ-విజిల్ యాప్ ను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిందన్నారు. ఈ యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘన అంశాలు లైవ్ ఫోటోలు, వీడియోలు తీసి ఈ.సీ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. ఎన్నికల నియమావళి అమలు తీరు పర్యవేక్షణకై జిల్లా స్థాయిలో ఇంటెలిజెన్స్ కమిటీని నెలకొల్పామని తెలిపారు.

# లోకసభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్**

**ఆసిఫాబాద్ ప్రతినిధి 17 ఏప్రిల్ సూర్య మేజర్ న్యూస్**

లోక్ సభ ఎన్నికల ప్రక్రియను భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో నామినేషన్ల ప్రక్రియ, తుది ఓటరు జాబితా రూపకల్పన పై సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలలో భాగంగా ఈనెల 18వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరగనున్న నామినేషన్ల స్వీకరణను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందని, అభ్యర్థులు తమ నామినేషన్ సమర్పించేటప్పుడు తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ జరగాలని తెలిపారు. పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. రాబోయే లోక్ సభ ఎన్నికలలో ఓటర్ స్లిప్పులు ప్రతి ఓటరుకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ముందస్తుగానే ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టాలని, ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యచరణపై పోటీ చేసే అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు ముందస్తుగా సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీలు నియమించిన పోలింగ్ ఏజెంట్లు, క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ స్లిప్ లు పంపిణీ చేసే సమయంలో పాల్గొనవచ్చని, ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరగాలని తెలిపారు. ఈ నెల 18న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని, 18 నుంచి 25వ తేది వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ రూపకల్పన వంటి అంశాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ స్వీకరణ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, పోటి చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, నామినేషన్ దాఖలుకు ముందు ప్రీ వెరిఫికేషన్ డెస్క్ వద్ద పరిశీలించాలని, రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి సాధ్యమైనంత వరకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ జరగాలని, రిటర్నింగ్ అధికారి చాంబర్ లో సి.సి. కేమేరాలు ఏర్పాటు చేయాలని, నామినేషన్ల స్వీకరణపై ప్రతిరోజు నివేదికలను సమర్పించాలని, ప్రతి రోజు దాఖలైన నామినేషన్ అభ్యర్థుల అఫిడవిట్ లు పారదర్శకంగా ఆన్ లైన్ లో నమోదు చేయాలని తెలిపారు. ప్రతిరోజు నమోదు అవుతున్న నామినేషన్లు సెట్ల వారీగా సమాచారం పకడ్బందీగా నమోదు చేయాలని, అభ్యర్థి ఫోటో సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ తీసుకోవాలని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించడం జరుగుతుందని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం జరుగుతుందని అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారి సురేష్, ఎన్నికల విభాగం అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల నిర్వహణ కొరకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందని, ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో సిర్పూర్, ఆసిఫాబాద్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ నిర్వహణ కొరకు పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అదనంగా 79 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ పట్టణంలో స్వచ్ఛందంగా వ్యాపార దుకాణాలు బంద్




**నిర్మల్ ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా కేంద్రంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా బుధవారం వ్యాపారులు దుకాణాలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ఏరియా, నారాయణరెడ్డి మార్కెట్, గాంధీ చౌక్, చింతకుంట వాడ ఏరియాతో పాటు పలు ప్రాంతాల్లో పలువురు వ్యాపారులు దుకాణాలను మూసి ఉంచారు.

## నిర్మల్‌లో బందోబస్తు పర్యవేక్షించిన డీఎస్పీ గంగారెడ్డి



**నిర్మల్ ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్**

శ్రీరామనవమిని పురస్కరించుకుని నిర్మల్ లో హిందూ వాహిని ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీరాముని శోభాయాత్ర బందోబస్తును డీఎస్పీ అల్లూరి గంగారెడ్డి పర్యవేక్షించారు. స్థానిక దేవరకోట ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా ప్రత్యేక పోలీస్ బెటాలియన్ తో బందోబస్తును పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ర్యాలీలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## తలమడుగులో అంత జైశ్రీరామ్ నాదమే

**తలమడుగు,ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్**

దేశవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు శ్రీరామనవమి పురస్కరించుకొని తలమడుగు మండల కేంద్రంలో మరియు దేవాపూర్ కుచులాపూర్ లింగి సుంకిడి మండలంలోని మరి కొన్ని గ్రామాలలో కూడా వైభవంగా శ్రీరామన వేడుకలు జరుపుకుంటూ సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను మొక్కుకున్నారు. రాముడి పై యువకులకు ప్రత్యేక ప్రేమ గౌరవం ఉంటుందని అందరికీ తెలిసే కని రామనవామికి మరోసారి రుజువైంది స్వయంగా యువకులే స్వంత డబ్బులు ఖర్చు చేసి వేడుకలను నిర్వహించి మరోసారి భక్తిని చూపించారు. అనంతరం గ్రామ పురవీధులలో రాముని ఫ్లెక్సీలతో రాముడి పాటలతో యువకులు ర్యాలీ నీ నిర్వహించారు.రాముడి పై యువకుల ప్రేమ చూపించారు.



## అభివృద్ధి పనులకు భూమి పూజ

**నిర్మల్ ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ పట్టణంలోని బంగల్ పేట్ కాలనీలో గల ప్రభుత్వ



ప్రాథమిక పాఠశాలలో రూ.2.42 లక్షల నిధులతో నిర్మించనున్న తాగునీటి, విద్యుత్, మూత్ర శాలల నిర్మాణ పనులకు బుధవారం వార్డ్ కౌన్సిలర్ నవీన్ భూమి పూజ చేశారు. పాఠశాలలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిధులను మంజూరు చేయించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ప్రజల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు

**నిర్మల్ ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్**

ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలోని ఐబి కేంద్రం వద్ద చలివేంద్రాన్ని ఎంపీడీఓ లక్ష్మణ్ బుధవారం ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని



ఏర్పాటు చేయడం జరిగిందని కళాకారుడు కథే శ్రీధర్ తెలిపారు. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్నందున చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలని ప్రాంత ప్రజలకు సూచించారు.

### కన్నుల పండువగా శ్రీరామనవమి ఉత్సవాలు



**భైంసా,ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్**

భైంసా మండలం దేగాం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను,శ్రీరాముని కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ వేద పండితులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామమహిళలు,యువకులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.కార్యక్రమ అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

**వాంకిడిలో...**

మండలంలోని బంబార గ్రామంలో గల రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పిటీసీ అజేయ్ కుమార్ దంపతులు పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగరంగ వైభవంగా నిర్వహించిన సీతా రాముల కళ్యాణానికి భక్తులు భారీగా తరలివచ్చారు.



## వైభవంగా సీతారాముల కళ్యాణం

**ఆసిఫాబాద్ ప్రతినిధి 17 ఏప్రిల్ సూర్య మేజర్ న్యూస్**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కోదండ రామాలయంలో బుధవారం సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. వేద పండితులు నిమ్మ కంటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని నిర్వహించారు. సీతారాముల కళ్యాణం చూసేందుకు పట్టణంలోని ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కళ్యాణి తిలకించారు. ఎమ్మెల్యే దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిజెపి నాయకురాలు సిద్దంశెట్టి సుహాసిని కాంగ్రెస్ నాయకులు బాలేశ్వర్ గౌడ్, మల్లేష్ తదితరులు కళ్యాణ మహోత్సవం లోపాల్గొన్నారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ఏర్పాటు చేయగా, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మంచినీటిని అందించారు నిమ్మ కంటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

**బోథ్‌లో..**

బోథ్ మండల శ్రీరామ నవమి సంబరాలు అంబరాన్నాటాయి. కళ్యాణ మహోత్సవ శోభాయాత్రలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మండలం మొత్తం కాషాయ మయం అయింది. సోనాల గ్రామం లో శ్రీ రాముని కళ్యాణం అంగరంగ వైభవం గా జరిపారు.ఈ వేడుకలకు వివిధ పార్టీల నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు శోభయాత్ర సందర్భంగా కూడలిలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణము చేశారు.

### శిశు మందిర్‌లో ఘనంగా శ్రీ రామ నవమి వేడుకలు

మండల కేంద్రంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శ్రీ రామస్తోత్రం, భజనలతో శ్రీ రాముడు ను పూజించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ రాజేంద్ర గౌడ్, విద్యార్థులకు శ్రీరాముడు నడతతో, నడవడికతో ప్రపంచంలోనే ఆదర్శప్రాయుడనిబీ సత్యాన్ని, ధర్మాన్ని విడిచిపెట్టలేదనీ, శ్రీ రాములు పాటించిన లక్షణాలు పితృ వాక్య పరిపాలన, ఒకటేమాట, దయ, సంబంధాలను గౌరవించే గుణం, పని మేనేజ్మెంట్ పాటిస్తే జీవితం లో విజయం సాధించవచ్చని వివరించారు

### కళ్యాణంలో పాల్గొన్నా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సోనాల గ్రామంలో శ్రీ.సీతాసమేతరామ కళ్యాణం మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడుతూ ఇంతటి రమణీయంగా శ్రీ. రాముని కళ్యాణం నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది అని అన్నారు భక్తులు ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడవడం వలన మనసుకు ప్రశాంతత లభిస్తుంది ఇలా అందరూ కలిసిమెలిసి పండగను ప్రతీ ఏటా ఇలానే ఘనంగా నిర్వహించుకోవాలి అని అన్నారు.

### సీతారామ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న అదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

శ్రీరామనవమి సందర్భంగా సోనాల గ్రామం లోని రామాలయ లో సీతారామ కళ్యాణ మహోత్సవంలో అదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క పాల్గొని సీతారాముల వారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది.

### శోభాయాత్రలో బలరాం జాదవ్:

బోథ్ లో నిర్వహించిన శ్రీరాముని శోభాయాత్రలో తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పాల్గొన్నారు.బోథ్ మండలం సోనాల గ్రామంలో శ్రీ రామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆ రాముల వారి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని వేడుకొన్నారు. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



# లోక్ సభ ఎన్నికలలో భారత ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

**మంచిర్యాల ప్రతినిధి,ఏప్రిల్ 17,సూర్య మేజర్ న్యూస్ :**

లోక్ సభ ఎన్నికలలో భారత ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా




అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో నామినేషన్ల స్వీకరణ, తుది ఓటరు జాబితా రూపకల్పన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలలో భాగంగా ఈ నెల 18వ తేదీన గెజిట్ విడుదల అయిన నాటి నుండి ఈనెల 25వ తేదీ వరకు జరగనున్న నామినేషన్ల స్వీకరణను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ అనంతరం పరిశీలన, ఉపసంహరణ, అభ్యంతరాల స్వీకరణ, తుది జాబితా విడుదల కార్యక్రమాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, ఓటర్ స్లిప్పులు ప్రతి ఓటరుకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ముందస్తుగానే ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టాలని, ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యచరణపై పోటీ చేసే అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు ముందస్తుగా సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీలు నియమించిన పోలింగ్ ఏజెంట్లు, క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ స్లిప్ లు పంపిణీ చేసే సమయంలో పాల్గొనవచ్చని, ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరగాలని తెలిపారు. ఈ నెల 18న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని, 18 నుంచి 25వ తేది వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యంతరాల స్వీకరణ, పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ రూపకల్పన వంటి అంశాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ స్వీకరణ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, పోటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, నామినేషన్ దాఖలుకు ముందు డెస్క్ వద్ద ప్రీ వెరిఫికేషన్ చేయాలని, రిటర్నింగ్ అధికారి కార్యాలయం లోనికి రావడానికి, బయటకు వెళ్లడానికి సాధ్యమైనంత వరకు ప్రత్యేక మార్గాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ జరగాలని, రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో సి.సి.కేమేరాలు ఏర్పాటు చేయాలని, నామినేషన్ల స్వీకరణపై ప్రతిరోజు నివేదికలను సమర్పించాలని, ప్రతి రోజు దాఖలైన నామినేషన్ అభ్యర్థుల అఫిడవిట్ లు పారదర్శకంగా ఆన్ లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రతిరోజు నమోదు అవుతున్న నామినేషన్లు సెట్ల వారీగా సమాచారం పకడ్బందీగా నమోదు చేయాలని, అభ్యర్థి ఫోటో సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ తీసుకోవాలని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించడం జరుగుతుందని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం జరుగుతుందని అన్నారు.

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల నిర్వహణ కొరకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందని, ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 002-చెన్నూర్ (ఎస్.సి.), 003-బెల్లంపల్లి (ఎస్.సి.), 004-మంచిర్యాల శాసనసభ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ నిర్వహణ కొరకు పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, ప్రత్యేక ఉప పాలనాధికారి (ఎల్.ఏ.,ఆర్&ఆర్) డి. చంద్రకళ, ఎన్నికల తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

**నిర్మల్ ప్రతినిధి ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్**



నిర్మల్ రూరల్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నిర్మల్లో డీసీసీ అధ్యక్షుడు కూచడి శ్రీహరి రావు సమక్షంలో నిర్మల్ మండల పార్టీ అధ్యక్షుడు వేణుగోపాల్, మేడిపల్లి మాజీ సర్పంచ్ కుంట పద్మాకర్ ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్

**నిర్మల్ ప్రతినిధి ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్**



పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రేపటి నుంచి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నందున అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. నామినేషన్లు వేసే ప్రతీ అభ్యర్థి నుంచి ఐదు చొప్పున ఫోటో కాపీలను తీసుకోవాలని తెలిపారు. ఈ ఫోటో కాపీ లలో ఎటువంటి రాజకీయ,మత ఇతరత్రా గుర్తులు, చిహ్నాలు ఉండరాదని ఆదేశించారు. రేపటి నుంచి స్టాటిక్ సర్వే లైన్స్ టీంలను, ఎక్సపండిచర్ టీం లను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ కార్డులలో పేరు, చిరునామా మార్పు కోసమై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అన్నారు. అర్హులైన వారందరికీ పోస్టల్ బ్యాలెట్లు, హెూం ఓటింగ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లకు సంబంధించిన ఎపిక్ నెంబర్లు నమోదు కానీ డేటాను జిల్లాల వారీగా సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన రిపోర్టులను సమయానికి పంపాలని అన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున పోలింగ్ కేంద్రాలలో టెంట్లు, త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ కి సంబంధించిన అన్ని సూచనలను బోర్డు రూపంలో ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియాలో పుకార్లు వ్యాపించకుండా నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం వెబ్ కాస్టింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ లోని వీడియో సమావేశ హాలు నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్, బైంసా, ఉట్నూర్ ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, జీవక్ రెడ్డిలు, డిఆర్ఓ భుజంగ్ రావ్, ఈడీఎం నదీమ్, ఎన్నికల సూపర్ ఇండెంట్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చిత్రపటాలు

**నిర్మల్ ప్రతినిధి ఏప్రిల్ 17, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ పట్టణంలోని పురవీధుల గుండా చేపట్టిన శ్రీరాముని శోభాయాత్రలో దేశం కోసం పోరాడిన వారి చిత్రపటాల ప్రదర్శన ఆకట్టుకుంది. అయోధ్య రామ మందిరం, ఝాన్సీ లక్ష్మీబాయి, స్వామి వివేకానంద, భగత్ సింగ్ చిత్రాలతో కాషాయపు జెండాలు, అయోధ్య బాలరాముడు, శ్రీకృష్ణార్జునులు, భరతమాత, బాల్ ఠాక్రే, నరేంద్ర మోదీ, చిత్రపటాలు శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# వేసవి పూర్తయ్యే వరకు నిరంతర త్రాగునీటి సరఫరాకు చర్యలు

## -జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి

**ఆసిఫాబాద్ ప్రతినిధి 17 ఏప్రిల్ సూర్య మేజర్ న్యూస్**



వేసవికాలం పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు సైతం నిరంతర త్రాగునీటి సరఫరాకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో దినపత్రికలలో వచ్చిన వార్త కథనాలపై తక్షణమే స్పందిస్తూ పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని జైనూర్ మండలం డబోలి గ్రామపంచాయతీలో 399 ఆవాసాలు, 1 వేయి 695 మంది జనాభా ఉండగా, గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డెరగూడ గ్రామంలో 35 ఆవాసాలు, 140 మంది జనాభా ఉన్నారని తెలిపారు. డబోలి గ్రామపంచాయతీలో ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు 10 చేతిపంపులు, 2 మోటార్ తో కూడిన బహిరంగ బావులు, 2 మోటారు లేని బహిరంగ బావులు, మిషన్ భగీరథ పథకంలో 40 కె. ఎల్. ఓ. హెచ్. ఎస్. ఆర్. 1, 20 కె. ఎల్. 3, 10 కె. ఎల్. 1, 5 కె.ఎల్. జి. ఎల్. ఆర్. 2 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వడ్డెరగూడతో పాటు షేకుగూడ, జాదుగూడ గ్రామాలలో గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఈ.ఈ., డి.ఈ.ఈ., ఏ.ఈ.ఈ.లు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరుగుతూ త్రాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. త్రాగునీటి సమస్యల పరిష్కారం దిశగా అధికారుల సమన్వయంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.